క్లుప్తంగా

అంధురాలిని పట్టించుకునేవారేరీ?


సంజమ్మ

పెద్దపప్పూరు: గత 15 రోజులుగా సంజమ్మ అనే అంధురాలు అశ్వత్థనారాయణ క్షేత్రంలో సాయం కోసం ఎదురుచూస్తోంది. 'అంధురాలిని అనాథగా వదిలేసి..' అన్న శీర్షికన ఈనెల 6న 'సాక్షి' కథనం కూడా ప్రచురితమైంది. ఆ వెంటనే ఆమె బంధువులు వచ్చి తీసుకెళ్తామని చెప్పినా ఎవరూ రాకపోవడంతో ఆమె కన్నీరు మున్నీరవుతోంది. నడవలేని స్థితిలో ఉన్న తనను బంధువులు పట్టించుకోవడంలేదు... కనీసం అధికారులైనా స్పందించి తనకు సాయం అందించాలని వేడుకుంటోంది.

ఘనంగా వ్యాస మహర్షి జయంతి


పామిడిలో వేదవ్యాసుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో గురువారం మహాభారత రచయిత వ్యాస మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాతత్వపరాయణులు, సురేంద్ర మహారాజ్, నారాయణ మూర్తి, రక్తదాతల సంస్థల సభ్యులు పీటర్ విజయ్, షామీర్, నవీన్, బద్రీనాథ్, సాధు యోగి బ్రహ్మజీరావు, యోగా ఫ్యాకల్టీ ఎస్.సంధ్యాదత్, రామ్‌నరేష్ తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంజీనాయక్, కుమారస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రికార్డ్ అసిస్టెంట్ మృతి


అనిల్ (ఫైల్)

గుత్తి: పట్టణంలోని కోట వీధికి చెందిన అనిల్ (44) గురువారం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. అనిల్ ఎంఎస్ హైస్కూల్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అనిల్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనిల్ మృతికి హెచ్‌ఎం కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో శ్రీరాములు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాచుపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు గ్రామ శివారులో ఉన్న బాట సుంకులమ్మ ఆలయానికి వెళ్లి ఇంటికి వస్తున్న సమయంలో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ గద్దం నాయుడు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎక్సైజ్ సీఐ గద్దం నాయుడు విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన కళాశాలలో టాపర్స్‌కు, క్రీడాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

పామిడి: కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండి ఇబ్బందులకు గురిచేస్తోందని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్ నాయక్ ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం విడుదల చేయాలన్నారు. పేద విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేసే జీఓ నంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ఈనెల 11న సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టే మహాధర్నాలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమేష్, రమణ, భాస్కర్‌రెడ్డి, గోపి, మణికంఠ, చంటి బాబు, గోపీనాథ్ పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునుంచే సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయిబాబా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. కాగడ హారతితో వేడుకలు ప్రారంభించారు. బాబాకు మంగళస్నానం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు చేరుకొని స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దాదాపుగా అన్ని ఆలయాల్లోనూ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

– సాక్షిబృందం:


జేసీఎస్ చెరువుకట్టపై బంగారు కవచాలంకరణలో షిర్డిసాయిబాబా


గార్లదిన్నె: సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి


గుత్తి రూరల్: అలంకరణలో సేవాలాల్ మహరాజ్


యల్లనూరు: పూజలందుకుంటున్న సాయినాథుడు


యాడికిలో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం


పెద్దపప్పూరు: చిన్నపప్పూరు సాయిబాబా


తాడిపత్రి: ప్రత్యేక అలంకరణలో షిర్డిసాయిబాబా


తాడిపత్రి: ప్రబోధానంద ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు


పామిడి: దత్త పాదుకాక్షేత్రంలో అన్నదానం


గుత్తిలో వ్రతం ఆచరిస్తున్న దృశ్యం


గుంతకల్లుటౌన్: భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం


చెరువు కట్టపై దర్శనం కోసం బారులుదీరిన భక్తులు


గుంతకల్లు పట్టణంలో...

పార్టీ బలోపేతానికి కృషి


మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కలిసిన వెన్నపూస వెంకటరామిరెడ్డి, తదితరులు

యాడికి: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని అనంతపురంలోని ఆయన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెన్నపూస వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. తన ఎంపికకు సహకరించినందుకు వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పెద్దారెడ్డి సూచించారని వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం వారంతా అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని కలిశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సంజీవరాయుడు, మోపిరెడ్డి, కోనా జగదీశ్వరరెడ్డి, క్రిష్టారెడ్డి, చలమారెడ్డి, ఆదినారాయణరెడ్డి, మారుతి, రామకృష్ణ, బీసీ మల్లికార్జున, శ్రీరంగ, సుదర్శన్, దేవేంద్ర, లక్ష్మిరంగారెడ్డి, లోకేష్ తదితరులు ఉన్నారు.

రైల్వే ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి


సమస్యలను వివరిస్తున్న ఎంయూ డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్

గుంతకల్లు: రైల్వే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ కోరారు. గురువారం గుంతకల్లు రైల్వే ఆస్పత్రికి విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే ఛీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మాల రాజరాంకు మెడికల్ బ్రాంచ్ సెక్రటరీ రమేష్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే ఆస్పత్రిలో ముఖ్యమైన సర్జన్, గైనకాలజిస్ట్ డాక్టర్లతోపాటు 7 నర్సింగ్ స్టాఫ్‌లు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న ఫార్మిసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్ పోస్టులు భర్తీకి నోచుకోలేదన్నారు. ఇక్కడి నుంచి అనంతపురం, కర్నూలులోని కార్పొరేట్ ఆస్పత్రులకు రైల్వే ఉద్యోగులను మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లు పట్టణానికి సమీపంలో ఉన్న బళ్లారి సిటీలోని కార్పొరేట్ ఆస్పత్రికి రెఫరల్ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అంతకముందు సీఎండీ నిర్మాల రాజరాం రైల్వే ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఓపీ విభాగాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

పేదరికాన్ని రూపుమాపే ఆయుధం విద్య


మాట్లాడుతున్న ఆర్‌డీఓ శ్రీనివాస్

గుంతకల్లు: పేదరికాన్ని రూపుమాపే శక్తి ఒక్క విద్యతోనే సాధ్యమని ఆర్‌డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీ శంకరనంద గిరిస్వామి జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. విద్యార్థులకు ఎన్ని కష్టాలు ఎదురైనా మీరు ఎంచుకున్న లక్ష్య సాధనలో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు మీ పిల్లల మధ్య సంబంధాలు మెరుగుపరచడంతో పాటు అభాస్యన పురోగతిని చర్చిందానికి ఈ వేదికలు ఉపయోగపడుతాయన్నారు. శింగనమల, తాడిపత్రిన నియోజకవర్గాల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, కరస్పాండెంట్ కేసీ హరి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని రైల్వే హైస్కూల్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం మధుసూదన్, ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరీ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

ఘనంగా ఉట్ల పరుష


ఉట్టి పగులగొడుతున్న యువత

పామిడి: పట్టణంలో రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని డబ్బేదార్ ఫిర్కా, రంగసుభే ఫిర్కాల ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా ఉట్ల పరుష నిర్వహించారు. రుక్మిణీపాండు రంగ స్వామి సతీసమేత థైయిండీ రథాన్ని భావసార్వక్షత్రియ భజన బృందం దిండి భజనల నడుమ పురువీధుల్లో ఊరేగించారు. ఉదయం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో, సాయంత్రం డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో ఈ ఉట్ల పరుష నిర్వహించారు. చెట్టుపై నుంచి ఉట్లు తిప్పుతుండగా కింద నుంచి యువత కట్టెలతో ఉట్లు పగులగొట్టడం చూపరులను ఆకట్టుకుంది. సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు చేపట్టారు. వారం రోజులుగా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు ఆషాఢ శుద్ధ పాడ్యమి శుక్రవారం వసంతోత్సవ కార్యక్రమాలతో ముగుస్తాయి.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి

యల్లనూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమశాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఇసుక పాలసీ విధానంపై జెడ్పీటీసీ రీ సర్వే డీటీ మునీంద్రను అడిగి తెలుసుకున్నారు. చాలా మంది కాంట్రాక్టర్లు సచివాలయ భవనం బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే మంజూరు చేయించాలని పీఆర్ జేఈ నరేంద్రను కోరారు. అనంతరం యల్లనూరులో 108 వాహనాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ తిమోతి వైద్యాధికారి లోకేష్‌ను అడిగాడు. ఉన్నతాధికారులతో చర్చించి 108 వాహనాన్ని యల్లనూరు పీహెచ్‌సీలో ఉండేలా చూస్తామన్నారు. సాయంత్రం వేళల్లో యల్లనూరు వైపు నడిచే బస్సు సర్వీసులను సక్రమంగా నడపాలని ఎంపీటీసీ తిమోతి ఆర్టీసీ అధికారులను కోరారు. ఎక్సైజ్ పోలీసులు, ఇరిగేషన్, తిమ్మంపల్లి పీహెచ్‌సీ వైద్యులు, పశు సంవర్ధక శాఖతో పాలు పలుశాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీడీఓ కరుణసాగర్‌పై ఎంపీపీ, జెడ్పీటీసీ అసహనం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ రామాదేవి, ఎంపీటీసీలు ఆదినారాయణరెడ్డి, లక్ష్మీదేవి, సిద్దమ్మ, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, పెద్దనాగరాజు, కుళ్లాయప్పనాయుడు, ఉప సర్పంచు భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఏఓ మధుకుమార్, ఎంఈఓ చంద్రోఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రజ, ఏపీఓ ఓబిరెడ్డి, హౌసింగ్ ఏఈ సుప్రజ, వైద్యాధికారి లోకేష్, ఐకేపీ ముత్యాలప్ప, డిప్యూటీ ఎంపీడీఓ మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. నారాయణుడి కల్యాణం


ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు సుదీర్‌కుమార్ శర్మ, బాలసుబ్రమణ్యశర్మ, సునీల్ కుమార్ శర్మలు శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం పెళ్లి మండపంలో స్వామివారి కల్యాణాన్ని సంప్రదాబద్ధంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈఓ సుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీ తాగుతూ కుప్పకూలి వ్యక్తి మృతి

గుత్తి: టీ తాగుతూ ఉన్నఫళంగా కుప్పకూలి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గుత్తి పట్టణంలోని కుమ్మర వీధిలో నివాసముంటున్న బోయ వేణు (45)కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం తన స్నేహితులతో కలసి కర్నూలు రోడ్డులో ఉన్న రాజస్థాన్ హోటల్ వద్ద టీ తాగుతూ ఉన్నఫళంగా కుప్పకూలాడు. స్నేహితులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వేణు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వంశీ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపం చెంది ఇంటికి సమపంలో ఉన్న ఖాళీ స్థలంలో విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న వంశీని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనలతో నూతన ఆవిష్కరణలు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, చిత్రంలో ఎథిక్స్ కమిటీ సభ్యులు

అనంతపురం మెడికల్: పరిశోధనలతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉటుంది. ఆ దిశగా విద్యార్థి దశ నుంచే యూజీసీ, పీజీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా పేర్కొన్నారు. గురువారం వైద్య కళాశాలలో పరిశోధనలకు సంబంధించి పీజీ మొదటి సంవత్సర విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీజీ విద్యార్థులు వారు చేయబోయే పరిశోధనలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రీసెర్చ్ ఎథిక్, సైంటిఫిక్, థీసీస్ కమిటీలకు తెలియజేశారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తెలుగు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ షంషాద్ బేగం, డాక్టర్ శంకర్, ప్రొఫెసర్లు డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ సురేశీ, కమిటీ సభ్యులు డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఆశాలత, డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


జయ్యన్న ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న నైరుతి రెడ్డి

గుంతకల్లు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న, అనారోగ్యంతో బాధపడుతన్న వైఎస్సార్‌సీపీ నాయకులను గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి పరామర్శించారు. వైటీ చెరువు గ్రామానికి చెందిన బీసీ సెల్ మాజీ మండల కన్వీనర్ జయ్యన్న కాలు ఫ్యాక్చర్ కావడంతో మంచానికే పరిమితం అయ్యాడు. గురువారం గ్రామానికి చేరుకున్న నైరుతి రెడ్డి.. జయ్యన్నను పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైటీ చెరువు సర్పంచ్ సోనియా తండ్రి గోవిందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే గ్రామంలో ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న నెట్టికల్లును పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దోసలుడుకి వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రంగనాయకులు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ జయరామిరెడ్డి, దోసలుడుకి గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నగేష్, పక్కీరప్ప, అంజి, లోకేష్, వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక


రఘువీర్


శ్రీనివాసులు


షెక్షావలి

పామిడి: మండల లయన్స్ క్లబ్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రఘువీర్, ప్రధాన కార్యదర్శిగా పత్రా శ్రీనివాసులు, కోశాధికారిగా డి.షెక్షావలి ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ అభ్యున్నతికి పాటుపడతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఆ క్లబ్ వైస్ గవర్నర్ విరుపాక్షిరెడ్డి, పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.